# అంతాక్షరి

"అవ్వా!"

"........."

"అవ్వా! అవ్వోవ్!"

సిటవుట్‌లో ఫైబర్ కుర్చీలో కూర్చొని, పుస్తకం చదువుకుంటున్న దుర్గమ్మ, మనుమరాలు మూడో పిలుపు వింది. సుషమ దగ్గరకు వచ్చి కొంచెం బిగ్గరగా పిలవటం వల్ల 'అవ్వా' అని పిలిపించుకోవడం అంటేనే దుర్గమ్మకు ఇష్టం.

నవ్వుతో, సుషమను పలకరించింది. చదువుతున్న పేజీల మధ్య చూపుడువేలుంచి, పుస్తకం మూసింది.

"బోర్ కొడుతోంది అవ్వా!" ముఖం మీదపడుతున్న జట్టు పాయల్ని ఎడమ చేత్తో తోసుకుంటూ, సుషమ గోముగా అమ్మమ్మ దుర్గమ్మ దగ్గర నిలబడింది.

"ఇక్కడ కూర్చుందువుగాని రా పాపా!" దుర్గమ్మ తన కాళ్ళ దగ్గర, అతి శుభ్రంగా మెరుస్తున్న పాలరాతి నేల మీద సుషమను మురిపెంగా కూర్చోబెట్టుకుంది. మెడల వరకు కత్తిరించుకున్న, నూనె పెట్టుకోని సుషమ జుట్టును, దుర్గమ్మ ముచ్చటగా సరిచేస్తూ అడిగింది:

"ఇప్పుడు చెప్పు పాపా!"

"చెప్పాకదా - బోరు బోరుగా వుందని?" దుర్గమ్మ కాళ్ళమధ్య చీర మడతల్లో సుషమ తలదాచుకుంది; కాసేపు ముక్కుతో రాసింది; గారాలు పోయింది.

"ఎందుకు పాపా! ఉన్నట్లుండి బోర్‌గా ఉంది? అంటావు. పుస్తకం తీసి దుర్గమ్మ పక్కన పెట్టింది. సుషమ వీపు నిమిరింది. లేపి, తన పక్క కుర్చీలో కూర్చోబెట్టుకుంది.

"బోరెందుకో నాకు తెలియదు", సుషమ అమాయకంగా, నిశ్చిత స్వరంతో అంది.

"ఎన్ని పనులు చేసినావో చెప్పు? నీకెందుకు విసుగొచ్చిందో చెప్తా."

"హోంవర్క్ సగం పూర్తి చేశా. కామిక్స్ కొన్ని చదివా. బోరుకొట్టింది."

"తర్వాత... వరసగా చేసిన పనులన్నీ చెప్పు వింటా."

"కంప్యూటర్ గేం ఆడుకున్నా. ఒక అరగంట టి.వి.లో నాలుగైదు ఛానల్స్ చూశా. అన్నీ బోరే."

"తర్వాత?"

"కాసేపు మ్యూజిక్ విన్నా. తర్వాత వి.సి.ఆర్. పెట్టుకున్నా. మా ఫ్రెండు వచ్చింది. నేనూ, అదీ చైనీస్ చెకర్ ఆడుకున్నాం."

"తర్వాత?"

"కారమ్స్ ఆడుకున్నాం. ఆ తర్వాత వర్డ్ బిల్డింగ్ ఆడుకున్నాం. బోరు కొట్టింది. మా ఫ్రెండుకు చెప్పా. 'నీకెప్పుడూ బోరే' అంటూ అది విసుక్కొని వెళ్ళిపోయింది. నాకు మాత్రం బోరు. ఏం చెయ్యాలి?"

"పాపా! నువ్వు ఏ పనీ పూర్తి చెయ్యలేకపోయినావంటావు. అంతేనా?" దుర్గమ్మ అనునయంగా అడిగింది.

"చేయాలనే ఉంటుందవ్వా. ప్చ్.... మధ్యలో బోరుగొడుతుంది. నన్నేం చేయమంటావు.... నువ్వే చెప్పు?" కింది పెదవి, పై పెదవి మీద ఉంచి, ప్రశ్నార్థకమైన ముఖం పెట్టిన సుషమను చూసి, దుర్గమ్మ ఆపేక్షగా అంది:

"మరి ఏం చేస్తామంటావు? ఏమైనా తింటావా? స్వీటు తింటావా? కారాలు తింటావా?"

"వద్దు బోర్!"

"పోనీ ఊరి నుంచి తెచ్చిన నెయ్యి అప్పచ్చులు ఇంకా ఉన్నాయి. నీకిష్టంగద పాపా?"

"అప్పచ్చులంటే అరిసెలు గదా? ఇష్టమే. ఇప్పుడు మాత్రం బోర్. వద్దవ్వా".

మనుమరాలి అసహనం ఎందుకో, దేనిమీదో దుర్గమ్మకు అర్థం కాలేదు.

"అవ్వా! నీకేం బోరు అన్పించదా?" సుషమ ఆకస్మిక ప్రశ్నకు దుర్గమ్మ ఆశ్చర్యపోయింది.

"అన్పించకేం? అనిపిస్తుంది. ఎప్పుడంటే అప్పుడు కాదు."

"ఎప్పుడు?" అరచేతుల్ని ముఖం మీద ఉంచుకొని, సుషమ కుతూహలం చూపింది.

"తనిఖీకి పది గంటలకల్లా వస్తానని చెప్పి, స్కూళ్ళ ఇన్స్పెక్టర్ సాయంత్రం దాకా రాకుండా మమ్మల్ని ఏడ్పించినప్పుడు... ఏ ఆగస్టు పదైదునాడో పిల్లల జెండా వందనానికి ఎవర్నో పిలిచినామనుకో ఆ పెద్దమనిషి పిల్లల్ని ఎండలో నిలబెట్టి, వాళ్ళకు అర్థం కాని గోల మాట్లాడినప్పుడు..."

"ఇదంతా నువ్వు టీచరుగా పని చేసినప్పటి సంగతి. నా వయసులో ఉన్నప్పుడు నీకు బోర్ కొట్టేది కాదా?" సుషమ ప్రశ్నకు దుర్గమ్మ వెంటనే జవాబు చెప్పలేకపోయింది.

"లేదు" అంది ముక్తసరిగా.

"సెలవు రోజుల్లో కూడానా?"

"మాకు బోర్ కొట్టే తీరిక ఉండేది కాదు పాపా. పల్లెటూర్లలో అంతే"

"నువ్వు ఏమేం ఆడుకునేదానివి?"

"అన్నీ పల్లెటూరి ఆటలే. తీరిక దొరికితే, మధ్యాహ్నాలు అచ్చనగాయలు ఆడుకునే వాళ్ళం; పరమపద సోపాన పటమో, బారాకట్టో ఆడుకునే వాళ్ళం. వెన్నెల రాత్రుళ్ళయితే ప్రతి రోజూ పిస్తుళ్ళు...."

"పిస్తుళ్ళు.... అదేం భాష? అదొకగేమా?" సుషమ పగలబడి నవ్వింది.

సుషమలో నవ్వు చూసినందుకు దుర్గమ్మ సంతోషించింది. ముద్దుగా మనుమరాలి నెత్తి మీద ఒక మొట్టికాయ వేసి అంది:

"అది పల్లెటూరి ఆడపిల్లలు ఆడే ఆట."

"మగపిల్లలు ఆడరా?"

"ఆడరు."

"పల్లెటూళ్ళలో మగపిల్లలు ఆటలు వేరు; ఆడ పిల్లల ఆటలు వేరా?"

"అవును."

"ఎందుకు?"

"ఎందుకని ఎప్పుడూ ఆలోచించలేదు పాపా!"

"పోనీలే ఆ పి....పి....పిస్... తుళ్ళు...." సుషమ తుళ్ళి తుళ్ళి నవ్వింది.

" పిస్తుళ్ళు, పిస్తుళ్ళు, ఇంతకు ముందు పలికినావు", దుర్గమ్మ సుషమ బుగ్గ సాగదీసింది.

"ఆ పిస్త్ .... పిస్తుళ్ళు ఎలా ఆడతారు?"

"ఆడ పిల్లలు గొంతు కూర్చుంటారు. తమ కుచ్చెళ్ళు అడ్డు పడకుండా చూసుకొని కాళ్ళను ముందుకూ, వెనక్కూ వేగంగా ఆడిస్తూ ఆడతారు."

"ఏదీ ఎలా? అవ్వా! అవ్వా! నాకు నేర్పించవా?" దుర్గమ్మ గడ్డం పట్టుకొని సుషమ ప్రాధేయపడింది.

"ఈ వయస్సులోనా? అరవై ఏండ్లు దాటినాయే బుజ్జి తల్లీ! నేర్పించాలంటే చూపాల. ఎట్లా చూపేది పాపా?"

"మా బుజ్జి అవ్వ! నీకు అరవై అంటే ఎవరూ నమ్మరు. ఆడేది చూపించవా?"

"సరేలే. ఇక్కడ వద్దు. ఎవరైనా చూస్తారు. లోపలికి పోదాం."

డ్రాయింగ్ రూంకు కాస్త ఎత్తుగా నిర్మించిన స్థలంలో....

దుర్గమ్మ ముందుగా పైటను తన నడుముకు బిగించుకుంది. చీరను గోచిలాగా పైకి ఎగచెక్కుకుంది. మోకాళ్ళు వొంచి కూర్చొంది. ముందు ఎడమ పాదాన్నీ, తర్వాత కుడి పాదాన్ని కదిలించి చూసుకుంది. రెండు నిమిషాలు వేగంగా పిస్తుళ్ళు ఆడింది. ప్రదర్శన ముగిసింది. తనకు దగ్గరగా కూర్చొని పరిశీలనగా చూస్తున్న మనుమరాలి భుజాలు పట్టుకొని దుర్గమ్మ అలసట తీర్చుకోటానికి గెస పోసుకుంది. గెస తగ్గాక "చూడు. నువ్వూ ఇట్లా ఆడు పాపా. చాలా సులభం. అంది. "

'అవ్వలో అంతటి శక్తి ఎక్కడిదా?' అని సుషమ సంభ్రమపడిపోయింది. తను చేసే స్కిప్పింగ్ కంటే పిస్తుళ్ళు బాగున్నాయని సుషమకు అనిపించింది. సుషమ ప్రయత్నించింది. వదులు మిడ్డీలో కాళ్ళాడించటం సుషమకు సులభమైంది. దుర్గమ్మ ఒకటి రెండు సార్లు దిద్దింది - "ఇట్లా..." "ఇట్లా" "పాదాలు నేలకు అదమకుండా, సులభంగా అవి కదిలేటట్లు చూసుకోవాల" అంటూ. అయిదు నిమిషాలకు పైగా సుషమ పిస్తుళ్ళు ఆడింది. "పిస్తుళ్ళు నాకొచ్చేశాయి. నాకొచ్చేశాయి" అంది శ్వాసను పీల్చుకుంటూ, విడుస్తూ, దుర్గమ్మను

పట్టుకుని ఊపుతూ.

"నువ్వు ఏదైనా నేర్చుకుంటావు. నీకు మంచి పట్టుదల వుంది పాపా!", అమ్మమ్మ మాటల ప్రోత్సాహానికి సుషమ ఉబ్బిపోయింది. అంతకుముందున్న అసహనం గాలికి ఎగిరిపోయింది.

"నువ్వు వెరిగ్రేట్ అవ్వా! వెరివెరి గ్రేట్.... ఇప్పుడు నా హోంవర్క్ పూర్తి చేస్తా చూడు.' ' సుషమ ఉత్సాహానికి దుర్గమ్మ ఆనందపడింది.

దుర్గమ్మ బయటికి వచ్చి, మళ్ళీ సిటవుట్‌లో కూర్చొంది. ఆమె మనసు అక్షరలోకంలో నిమగ్నం కాలేదు.

జుబిలీ హిల్స్‌ను కిందు మీదు చేసి, పిచ్చలు పిచ్చలు చేసి, కిందో మీదో, లక్షలు లక్షలు కుమ్మరించి పుట్టించిన సుందర గృహాల్నీ,, పచ్చదనాన్ని మించిన కాంక్రీటు ఆకర్షణనూ దుర్గమ్మ చూస్తూ కూర్చుంది. దుర్గమ్మకు కన్పిస్తున్న ఇళ్ళన్నీ, భారతీయ, రోమన్, మొగల్ వాస్తు శైలుల కలగాపులగపు శైలుల్లో ఉన్నాయి. కట్టించిన వాళ్ళ అర్థకామాలకు సంకేతాలుగా ఉన్నాయి. అలంకార సౌందర్యాలకు దృష్టాంతాలుగా ఉన్నాయి. సుఖ సంతోషాలకు కొండగుర్తులుగా ఉన్నాయి.

దుర్గమ్మ ఆలోచనలు కూతురింటి మీదకు మళ్ళాయి; ఇంట్లోని సంస్కృతి చుట్టూ తిరిగాయి.

దుర్గమ్మ వారం కిందట ఈ కొత్తింటి గృహ ప్రవేశానికి ఊరు నుంచి వచ్చింది. ఇంటిని చూసీ చూడగానే 'కాపురముండేది ముగ్గురు. ఇంత ఇల్లెందుకో?' అనుకుంది- పైకి అనలేదుగాని. లండన్‌లోనూ, సౌదీలోనూ, నర్సింగ్ హోంలోనూ మిగిలిన డబ్బులతో మంచి ఇల్లే కట్టుకున్నారని సమాధానపడింది.

గృహ ప్రవేశం రోజు చేసిన ఆర్భాటమూ, ఇచ్చిన విందూ, కార్లలో వచ్చిన అతిధుల హాసాలూ, అట్టహాసాలూ దుర్గమ్మ మనసులో గజిబిజి అయ్యాయి. అల్లుడు నలుపురి మధ్యా అన్నది గుర్తు కొచ్చింది. 'కార్డిఫ్‌లో ఒక మిత్రుడి ఇంటి నమూనా ప్రకారం కట్టించాడంట!' 'మన వాస్తు మొక్కపోకుండా, గృహ బలం ఉండేటట్లు' 'సవ్యంగా కట్టించాడంట!' 'గ్రహబలం చూసే గృహ ప్రవేశం ముహూర్తం, సత్యనారాయణ వ్రతం, విందు అన్నీ ఏర్పాటు చేశాడంట!' 'తూర్పు వైపు సిటవుట్ రావటానికి రెండు లక్షలు ఖర్చయింది' అని కూడా అల్లుడన్నాడు...

వారం రోజులుగా ఇంట్లోని వస్తు సంస్కృతినీ, సంస్కారాన్నీ దుర్గమ్మ దగ్గరగానే చూసింది. వీటి మధ్య కూతురు ప్రవంతి బందీ అయిపోయిందని తెలుసుకుంది. పైగా సుషమ అసహనమూ, ఏపుగా పెరిగినా పదకొండేళ్ళు, నిన్ననో మొన్ననో దాటిన సుషమ అసహజ ప్రవర్తనా దుర్గమ్మను తీవ్రంగా కలవరపెట్టాయి.

కూతురు ప్రవంతి, అల్లుడు శర్మది రోగాలూ, డబ్బుల ప్రపంచం. ఉదయం ఎనిమిది గంటలలోపే కారేసుకొని హడావిడిగా నర్సింగ్ హోంకు వెళ్ళిపోతారు. క్రమశిక్షణ తప్పరు. వేగంలో కొట్టుకపోతారు. మధ్యాహ్నం రెండు గంటలకొస్తారు. మళ్ళీ నాలుగు గంటలకు పోతారు. రాత్రి తొమ్మిది దాటాకే తిరిగి రావడం. నాల్గు చేతులా సంపాదిస్తున్నారు- నర్సింగ్ హోం బయటి మెడికల్ షాపు సాయమూ, మిగతా చేతుల తోడ్పాటూ గాక. స్కూలూ, చదువూ, పని మనిషి తోడూ సుషమ ప్రపంచం. ముగ్గురి మధ్యా పెద్దగా మాటలు లేని ప్రపంచం. కూతురు అల్లుడి బెడ్ రూం తప్పితే ఎవరి గదులు వాళ్ళవి - అతిథులకు కేటాయించిన మేడమీద రెండు గదులు గాక.

ఈ ఇంట్లో చాలా చాలా ఉన్నాయి. కానీ ఏదో వెలితి ఉంది. ఏం వెలితి అది? సుషమ రూపంలో కన్పడేదా? మరొకటా? దుర్గమ్మ తల బద్దలు కొట్టకొని ఆలోచించింది. ఆ సందర్భంలోనే, దుర్గమ్మకు తమ పల్లెటూరు జ్ఞాపకానికి వచ్చింది; భర్త మనసులో మెదిలాడు.

ఆయన కూతురు గృహ ప్రవేశానికి రాలేదు. 'నువ్వు పోయిరా' అన్నాడు. రిటయిరయ్యాక ఆయనకు ఉన్న ఊరే సర్వస్వమైపోయింది. ముప్పయేళ్ళుగా తనకు తెలిసిన హోమియో వైద్యం చేస్తున్నారు - పేదాసాదాకు. పైసా తీసుకోడు. ఇంటి దగ్గరకు వచ్చిన పిల్లలకు నాలుగు ముక్కలు చెప్తాడు. డబ్బు తీసుకోడు. 'ఉద్యోగంలో తీసుకున్నది, తీసుకుంటున్నది చాలులే' అంటాడు. ఊరి రాజకీయాల్లో వేలు పెట్టడు. మిగిలిన పిత్రార్జితం ఇల్లుంది. ఒక ఎకరా తోట ఉంది. తోట పని ఇద్దరూ కలిసి చేస్తారు. తను ఆడ పిల్లలకు చదువు చెప్తుంది. కాలక్షేపానికి ఒక రేడియో ఉంది, నలుపు తెలుపు టి.వి. ఉంది. టి.వి.కి వచ్చే నలుగురి సందడీ ఉంది.

దుర్గమ్మ తన భర్త తోటి జీవితమే ఇక్కడికంటే మెరుగనిపించింది. నగర జీవితంలోని కూతురి ఇంటితో పోల్చి ఆలోచించింది. తమ ఊళ్ళోది ఒకరకంగా గుంపు చలనం; ఇక్కడిది మరీ ఒంటిగాళ్ళ చలనం అనుకుంది. ఈ చలనంలో అన్నీ ఉన్నాయి. దేనికీ స్థిమితం లేదు. 'బోర్.... పరమ బోర్!' మనుమరాలు భాష తనకు వారం రోజుల్లోనే అబ్బింది.

దుర్గమ్మ కోడినిద్రలోకి జారుకుంది.

☆ ☆ ☆

దుర్గ వాళ్ళమ్మ రామసుబ్బమ్మ దుర్గ మీద కేకలు వేస్తోంది:

"పెద్ద మనిషయినావు. పైటలేసుకుంటాండావు. రాత్రయిందంటే ఆ పిస్తుళ్ళు.... ఆ ఎగుర్లాటలు! ఇక ఇకలూ పకపకలూ! మీ నాయనకు చెప్తే 'చిన్న పిల్ల పోనీలే'' అంటాడు. మా యమ్మకు నేను గుడక చిన్నపిల్లనే. పద్నాలుగేండ్లు నెత్తిమిందకొచ్చినాయి...ఇంకా ఆటలూ పాటలూ.''

"అమ్మా! ఈ పొద్దు పున్నమి... వెన్నెల''

"నీకు పున్నమే నమ్మా! వెన్నెలే తల్లీ! నాకు మాత్తరం ఎప్పుడూ చీకటే. నా రాత! పుట్టింది ముగ్గురూ ఆడదయ్యాలే. పెద్దోళ్ళిద్దరికీ ఎట్లాగో పెండ్లిండ్లు అయినాయి. ఆ పార్టీల కొంపల్లో వాళ్ళ చావులు వాళ్ళు చస్తాండారు. నువ్వు స్కూలు పోతానని మొత్తుకున్నావు. మీ నాయన సై అన్నాడు. నా కొచ్చిపడింది. పాపం! స్కూలుకు రెండు మైళ్ళు నడిచి పోతాండవని టిపిను కారియరు ఏర్పాటు చెయ్యాలి. నీకు చదువు. నాకుఇంట్లో పని, బయటపని. నీకు నీ సావాసగాళ్ళు కావాలి, పున్నమి గావాల. వెన్నెల గావాల. మరినాకో? ఇంట్లో ఈ చట్లూ కుండలూనా? ఇదో ఈ గాటిపాట ఎనుములూ, ఎద్దులూ, పడ్డలూనా? ఈ చీకటా?

అమ్మ, దోనిలో కడుగునీళ్ళు పోస్తున్న చప్పుడు...

☆ ☆ ☆

దుర్గమ్మ ఉలిక్కి పడి కళ్ళు తెరిచి చూసింది. ఎదురుగా పనిమనిషి మొక్కలకు నీళ్ళు పడుతూ కన్పించింది. దుర్గమ్మ చేతి గడియారం చూసుకుంది. సాయంత్రం అయిదు గంటలు దాటింది.

సుషమ గుర్తుకొచ్చి, దుర్గమ్మ మనస్సు చివుక్కుమంది. 'ఏదన్నా తిందోలేదో పాపం!' అనుకుంటూ దుర్గమ్మ సుషమ గదికి వెళ్ళింది. మంచానికి అడ్డంగా బోర్లబడి, సుషమ నిద్రపోతూ కన్పించింది. పరుపుమీద ఆ పక్క వాక్మన్ పడివుంది. ఈ పక్క పత్రికలూ, పుస్తకాలూ పడివున్నాయి. దుర్గమ్మ సుషమను లేపలేకపోయింది. సిటవుట్‌లోకి వెళ్ళి మళ్ళీ

పుస్తకాన్ని పట్టుకుంది.

కాసేపటికి మళ్లీ కునికింది.

స్రవంతిని దుర్గ మందలిస్తూంది:

"మగ పిల్లలతో పూసుకొని తిరగద్దు స్రవంతీ!"

నోట్సులిచ్చుకోవడం, తీసుకోవడం తప్పా? మాట్లాడితే తప్పా అమ్మా?"

భర్త కలుగజేసుకుంటున్నాడు:

"ఆడ పిల్లలూ, మగ పిల్లలూ కలిసి చదువుకుంటున్నారు. నీకు తెలియందేముంది? ఎవరి జీవితాన్ని వాళ్ళు దిద్దుకుంటారు."

..........

"చూడు...... కర్నూలు నుంచి స్రవంతి ఉత్తరం. కులాంతర వివాహం చేసుకున్నదట! భర్త తరపు వాళ్ళతో గొడవ అవుతుందని భయపడిందంట! 'మా వాళ్ళకూ ఈ విషయం తెలియకూడదు. మీ వాళ్ళకూ తెలియకూడదు. అన్నీ అవే సర్దుకుంటాయి' అని అతను అన్నాడంట! తను సరే నందంట. 'ఇక కన్నవాళ్ళతో పనేముంది?" దుర్గమ్మ కళ్ళు ఒత్తుకుంటూంది.

"ఇద్దరూ ఎం.డి. లు. వాళ్ళ సంపాదన వాళ్ళ కుంది. వాళ్ళ జీవితం వాళ్లది. అది మనది కాదు", భర్త అనునయిస్తున్నాడు.

..........

పనిమనిషి దుర్గమ్మను తట్టిలేపింది. టీ తాగమంది. ముఖం కడుక్కొని, పనిమనిషితో "మరి సుషమ..." అంటున్న లోపల సుషమ దగ్గరకు వచ్చింది.

"అవ్వా! నేను కాంప్లాన్ తాగాలే. నువ్వు టీ తాగు. కాసేపు తోటలో తిరుగుదాం".

దుర్గమ్మ టీ పూర్తి చేసిందో లేదో, సుషమ ఇంటి ముందు తోటలోకి ఆమెను లాక్కుపోయింది. తోటలో కూడా సుషమలో నిలకడతనాన్ని దుర్గమ్మ చూడలేకపోయింది.

మరుసటి రోజు ఉదయం, అమ్మా నాన్నలు నర్సింగ్ హోంకు వెళ్ళడమే ఆలస్యం. సుషమ, దుర్గమ్మ దగ్గరకు చేరింది. భయం భయంగా "అవ్వా!" "అవ్వా!" అంటూ దుర్గమ్మ చెవిలో గొణిగింది. సుషమను దుర్గమ్మ ఎగాదిగా చూసింది. 'బుద్ధి ఎదిగింది; పసితనపు గుర్తులు పోలేదు' అనుకుంది. జాలి వేసింది. "రా పాపా! నీ గదిలో విశ్రాంతి తీసుకో. భయమేం లేదులే. అమ్మకు ఫోను చేస్తానుండు", అంది దుర్గమ్మ.

అవ్వ పొత్తికడుపు చుట్టూ చేతులు వేసి సుషమ కన్నీళ్ళు పెట్టుకుంటూ వాపోయింది.

"అమ్మకు ఉదయం చెప్పలేదవ్వా! నాకు అమ్మను చూస్తే భయం. అమ్మకు ఎప్పుడూ విసుగూ, కోపం. 'అది చేయి, ఇది చేయి... అట్లా ఉండాలి... ఇట్లా ఉండకూడదు' అంటూనే వుంటుంది.నీతో తప్ప ఇంకెవరికీ చెప్పలేదు. నా నైటీని నా బాత్ రూంలో దాచా"

"నీ అవ్వ ఉంది గదా? నీకు దిగులెందుకు? భయమెందుకు? సుషమ కళ్ళు తుడిచింది దుర్గమ్మ. గదిలోకి తీసుకవెళ్ళింది. ముందు సుషమను మంచం మీద పడుకోబెడదామనుకున్న దుర్గమ్మ, సుషమ గదిలోనే ఒక మూల చాపపరిచింది- తన కూతురు భయంతో.

"ఎందుకైనా మంచిది. నువ్వు ఆ చాపమీద కూర్చో పాపా! లేదా పడుకో. నీఇష్టం" అంది దుర్గమ్మ. తాను ఏదో తప్పు చేసినట్లు సుషమ సిగ్గుతో, తల వంచుకొని కూర్చొని

"బోర్... బోర్..." అని గొణుక్కుంది.

దుర్గమ్మ కూతురు స్రవంతికి ఫోను చేసింది. స్రవంతి హడావిడిగా కారు దిగీదిగగానే, సుషను గదికి వెళ్లింది. డాక్టరుగా కాకుండా, తల్లి హోదాలో సుషమను అడిగింది:

"ఎన్ని గంటలకు?"

"నిద్ర లేచేసరికి", తల్లి కళ్ళల్లోకి చూడకుండా, తలవంచుకునే సుషమ సమాధానం చెప్పింది.

"నేను నర్సింగ్ హోంకు వెళ్ళే ముందు ఎందుకు చెప్పలేదు?"

"బ్రేక్ ఫాస్ట్ మాతోనే చేశావు. బుద్ధి లేదా?"

"బోర్... బోర్... " సుషను ఏడవడం మొదలు పెట్టింది.

"ఆ బోర్ బోర్ మానవన్నమాట! మొన్న బాగా తిట్లు పడ్డాయి కదా? మానావనుకున్నా. మీ నాన్న చెప్పింది జ్ఞాపకం లేదా? - 'ఇలా బోర్ బోర్ అన్నావంటే సైకియాట్రిస్టుకు చూపుతా' నన్నది గుర్తు లేదా? ముందు ఆ మాట మాను. సరేలే... ఎక్కడికీ కదలొద్దు - మూడు రోజుల స్నానం అయ్యేదాకా గది దాటి బయటికి రావద్దు. నీ ఫ్రెండ్స్‌కు ఎవరికీ ఈ మూడు రోజులూ ఫోన్లు చెయ్యొద్దు. వాళ్ళు చేస్తే 'మద్రాస్ ఐ వచ్చింది. మా అమ్మ రావద్దని చెప్పింది' అని చెప్పు...."

కానీ ఆ మాటలు భర్త, అత్తమామల, వాళ్ళ బంధువుల రామాజ్ఞలకు ఆధీనంగా అన్నవని, దుర్గమ్మ తల్లి హృదయం గుర్తించలేకపోయింది. కూతురు మాటలు ఆడ సుగ్రీవాజ్ఞగా దుర్గమ్మకు తోచాయి. 'ఇంత మామూలు విషయంలో ఈ ఆంక్షలేమిటి? కండ్లకలక అబద్ధాలెందుకో?' అనుకుంది.

"పాప జడుసుకుంది- తెలీక. చిన్న పిల్లాయే. నేనున్నాలే" దుర్గమ్మ కూతురితో అంది.

స్రవంతి తన గదిలోకి వెళ్ళింది. పది నిముషాలయ్యాక వచ్చి, డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్న తల్లితో అంది.

"మన అదృష్టం! మంచి సమయం; మంచి నక్షత్రం అట! శాంతుల బాధ తప్పింది. అక్కడికి మేలు. ఇది మన ఇంటి వాస్తు బలమే అని కూడా అన్నారు..."

ఆ అన్నది ఎవరో దుర్గమ్మ సులభంగానే ఊహించుకుంది. ఆడ పిల్లల శరీరంలో జరిగే ఒక మామూలు ప్రకృతి చర్యకూ, గ్రహాలకూ మధ్య ఉండే సంబంధం, కూతురి మాటల ద్వారా దుర్గమ్మకు తొలిసారి తెలిసివచ్చింది. ఆమె పల్లెటూరి శూద్ర జీవితంలో ఈ అనుభవమూలేదు. ఈ జ్ఞానమూ లేదు. పెద్దబాల శిక్షలో చదివినట్లు గుర్తైతే వుందిగానీ, ఏనాడూ తమ కుటుంబాల్లో ఈ రకం పట్టింపులూ లేవు; ప్రభావాలూ లేవు.

ఏమేం చేయాలో మాట వరసకైనా డాక్టరమ్మ స్రవంతి తల్లితో సంప్రదించలేదు. "సంప్రదాయం ప్రకారం చేద్దామమ్మా! శర్మా వాళ్ళమ్మా నాన్నలూ వాళ్ళ బంధువులూ సంతోషిస్తారు. విశాఖపట్నానికి శర్మ వాళ్ళ అమ్మకు- అత్తయ్యకు - ఫోను చేయాలి", అంది తన గదిలోకి వెళుతూ. కార్డ్‌లెస్‌లో ముఖ్యులకు ఫోన్లు చేసి స్రవంతి నర్సింగ్ హోం వెళ్లిపోయింది. వెళ్ళే ముందు కూడా సుషమకు జాగ్రత్తలు చెప్పి పోయింది.

పండ్రెండు గంటలలోపే, కొబ్బెర, బెల్లం, నువ్వులు దంచి చేయించిన నూగుపిండి ముద్దలు, నానబెట్టిన బియ్యం దంచి, బెల్లం కలిపి చేయించిన చలిబిండి ఇంటికి చేరే ఏర్పాటును స్రవంతి చేసింది. నగరంలో పేరు మోసిన 'స్వగృహ ఫుడ్స్' వాళ్ళు డాక్టరమ్మ

కోసం ప్రత్యేకంగా తయారు చేసి పంపారు. వాటిని సుషమకు పెట్టమని స్రవంతి తల్లికి ఫోను చేసి చెప్పింది. తినమని మనుమరాలిని బ్రతిమాలింది. ఒకటి రెండు కొరికి 'బోర్' అంది సుషమ. 'అప్పచ్చులే' కావాలంది. "బాగా చేశావు అవ్వా!" అంటూ ఆప్యాయంగా వాటిని తింది. మొదటి రెండు రోజులూ ఎక్కువ భాగం సుషమ దగ్గరే దుర్గమ్మ గడిపింది. కబుర్లు చెప్పింది; కథలు చెప్పింది- అల్లుడూ, కూతురూ ఇంట్లో లేని సమయాల్లో మరీ ముఖ్యంగా.

మూడు రోజుల స్నానం అయింది.

పదకొండో రోజు విశాఖ నుంచి సుషమ నానమ్మ, తాతయ్యా దిగారు. ఇంట్లో వాతావరణం మరింతగా రంగులు మారింది. సుషమ ఉక్కిరి బిక్కిరయింది. అయిదేళ్ళు వాళ్ళ దగ్గర పెరిగింది. వాళ్లంటే సుషమకు అంత ఇష్టమేమీ లేదు. నాన్నమ్మ తల్లిలా కసరదు. తాతయ్య తండ్రిలా ఉపన్యాసలివ్వడు. కానీ ఇద్దరూ ఇద్దరే. మరీ ముఖ్యంగా నాన్నమ్మ క్షణక్షణమూ తన్ను ఆడపిల్ల... ఆడపిల్ల... అనే విషయాన్ని జ్ఞాపకం చేస్తుంది. అందుకే సుషమకు వాళ్లంటే మరీ ఇదిలేదు.

వియ్యపురాలి ఆచారాల పట్టును చూసి దుర్గమ్మే జడుసుకుంది. వియ్యంకుడి మడి మశానమూ, పూజలూ పునస్కారాలూ చూసి బిత్తరపోయింది. 'వీటి ద్వారానే రోగులకు వియ్యంకుడు వైద్యం చెయ్యడం లేదు కదా? అని ఆశ్చర్యపడింది. స్రవంతి, శర్మల పెళ్ళయ్యాక పదమూడేళ్ళలో దుర్గమ్మ వాళ్ళను చూసింది రెండు మార్లే. వాళ్ళతో గడిపింది. ఒకటి రెండు గంటలే. ఈ మూడో పర్యాయం, ఏకంగా ముప్పయ్యారు గంటలకుపైగా వాళ్లతో మెసలాల్సి వచ్చింది.

సుషమ నాన్నమ్మ ఏవో మంగళ స్నానాలంది. మరేవో పూజలంది. నగలంది. నగ్రలంది. అలంకరణలంది. బంధువులంది. కట్నాలంది. కానుకలంది. ఏదేదో అంది. ఏదేదో చేసింది. ఇవన్నీ అడపాదడపా సరదాగా అన్పించినా, సుషమ అన్నిటికీ సర్దుకోలేకపోయింది పైగా 'తన అవ్వ' ముభావంగా ఉండటం చూసి.

విందు సందర్భంలో నాన్న, తాతయ్యను వెనకేసుకొని రావటం సుషమ పసిగట్టింది. 'ఇలాంటి నాన్న అమ్మను ఎందుకు పెళ్ళి చేసుకున్నట్లు?' అనుకుంది.

నలుగురూ వింటూండగా నాన్న అన్నాడు.

"మా ఫాదర్ చెప్పింది అక్షరాలా నిజం. ఆరు మాసాల కిందటి ముచ్చట మా క్లోజ్ ఫ్రెండ్ - నాన్ బ్రాహ్మినే- అమెరికా నుండి అర్ధరాత్రి ఫోను చేశాడు. వాళ్ళ అమ్మాయి రజస్వల అయింది. పద్ధతి ప్రకారం ఏం జరిపించాలని అడిగాడు. సమయానికి మా అమ్మ కూడా వుంది. నక్షత్రం అడిగి మరీ చెప్పింది. పిట్స్‌బర్గ్ టెంపుల్‌లో శాంతి కూడా చేయించారు. మరి అతను పెద్ద సైంటిస్టు కూడా. మన ఆచారాలే మన సంస్కృతి. ఇంగ్లండ్‌లో సంప్రదాయాలను అందరూ గౌరవిస్తారు సౌదీలో మాత్రం. వాళ్ళు పాటించే మతాచారాలను చూసి మనం ఏమేమో అనుకుంటాం. ఏదేదో అంటాం. ఎవరైనా ఆడమనిషి బురఖా లేకుండా కన్పించిందనుకోండి. మతం పెద్ద చూశాడనుకోండి. వెంటనే స్వంత డబ్బుతో ఒక బురఖా కొని ఆవిడకిస్తాడు. మనకేమో మన సంప్రదాయాలంటే గౌరవం లేదు; ఆచారాలంటే మర్యాద లేదు."

వాదంలో ఒక కుర్ర డాక్టరు కలుగజేసుకున్నాడు.

"బురఖా మన ఆడవాళ్ళకు కూడా వేస్తే, మన సంప్రదాయం మరింత బలపడుతుంది సార్! మన ఆచారాలు మరింత గట్టిపడతాయి సార్! మన సంస్కృతికి మరింత ప్రచారం

వస్తుంది, విదేశాల్లో."

అందరూ నవ్వేశారు.

సుషమకు ఈ మాటలన్నీ పూర్తిగా అర్థం కాకపోయినా, అవి న్యాయంగా అన్పించలేదు. అంతా 'బోర్' 'బోర్' అనుకుంది. 'తన వేషం బోర్, తన పరిస్థితి బోర్, వాళ్ళ మాటలు బోర్' అనుకుంది.

దుర్గమ్మకు మొత్తం వ్యవహారమంతా నటనగా కన్పించింది. అసలు నచ్చని మరొక ముఖ్యమైన నటుడ్ని ఈ తంతులో దుర్గమ్మ చూసింది. ముదురు కాషాయ రంగు బట్టల్లో, మెడలో పెద్ద రుద్రాక్షల మాలతో మొత్తం తంతునంతా అడుగడుగునా నడిపించిన అల్లుడింటి వాస్తు జ్యోతిష్య పురోహిత గురువు. ఆయన ధాటీ దుర్గమ్మకు అసలు నచ్చలేదు. పల్లెటూళ్ళ తంతుల్లో ఈ ధాటీలు లేవు అనుకుంది. అక్కడికీ ఇక్కడికీ భేదం, అక్కడ పల్లెటూళ్ళలో తంతులు నలుగురూ పాల్గొని చేసేవి; పంచుకొని చేసేవి. ఇక్కడ అంతా ప్రదర్శనమే. అంతా వికృతమే. నలుగురి ముందూ గొప్పకోసం చేసే ప్రదర్శనలివి; లాభం కోసం చేసేవి. నిజమైన ఆపేక్షలు లేని మనుషులు వీళ్ళు. వీళ్ళ మధ్య సుషమ జీవితం ఏ రకమైన మలుపులు తిరగవచ్చు? ఏం కావచ్చు?

దుర్గమ్మకు అంతా అయోమయంగా తోచింది. తన తల్లి పెంపకం గుర్తుకొచ్చింది. ఆ పెంపకంలో బరువులూ బాధ్యతలే అన్నీ. అన్నీ గుదిబండలే. తల్లిదీ తండ్రిదీ వానకాలం చదువు. తను పదెకరాల మెట్ట రైతు మూడో కూతురు. తనకు స్రవంతి ఒక్కతే బిడ్డ. ఇద్దరు టీచర్ల కూతురు. ప్రేమతో కూడా పెంచినారు. తన కూతురికీ ఒకే బిడ్డ. డాక్టర్ల బిడ్డ. లక్షల ఆస్తి బిడ్డ. జీవితం మారింది. మారుతూ వచ్చిన జీవితంలో ఆడపిల్లల బతుకు సూత్రాలు ఎవరి చేతుల్లో ఉన్నాయో? దేని చేతిలో ఉన్నాయో? మరీ సుషమ లాంటి పసి పిల్లలవి?

ఆలోచించే కొద్దీ, దుర్గమ్మకు మనస్తాపం పెరిగిందే కానీ తగ్గలేదు. తానుగా సుషమకు ఏదారీ చూపలేనని దుర్గమ్మ తెలుసుకుంది. ఊరికి వెళ్ళడానికే నిశ్చయించుకొంది.

"రేపటికి రాయలసీమకు టిక్కెట్టు రిజర్వు చేయించు... మీ నాయన ఏ అవస్థలు పడుతున్నాడో?" అని కూతురితో చెప్పింది.

"నువ్వూ, నాన్నా ఇక్కడ ఉంటే పెద్ద దిక్కుగా ఉంటుంది. నాన్న రాడు. ఎక్కడికీ కదలడు. నువ్వు ఆయనను వదిలి వుండవు. నాకు తెలుసు. శర్మ వాళ్ళ నాన్న అమ్మా ఇక్కడ ఉండరు. మామయ్యకు అక్కడ ప్రాక్టీసు పోగొట్టుకోవడం ఇష్టం లేదు. అప్పుడే వెళ్ళిపోయారు చూడు! సరే... ఎవరి తిప్పలు వాళ్ళవి. ఈ మారైనా నాన్నను బలవంతం చేసి తీసుకొని రా.... సుషమ నీకు బాగా మాలిమి అయింది. నేను చేసేదేముంది?" కూతురు మాటలకు దుర్గమ్మ బదులు చెప్పలేదు.

దుర్గమ్మకు ఆరోజు ప్రయాణం. ఆదివారం కూడా. వెళ్ళేముందు సుషమతో చెప్పవచ్చు అనుకుంది. మనుమరాలి సంగతేమో కానీ, అవ్వకు మాత్రం సుషమను విడిచి వెళ్లాలని లేదు. వెళ్ళక తప్పదు. "మధ్యాహ్నం వరకే నర్సింగ్ హోం. మేం వచ్చి స్టేషన్లో దిగబెడతాం" అని కూతురు చెప్పిపోయింది.

సిటవుట్‌లో కూర్చొని దుర్గమ్మ అన్యమనస్కంగా పత్రికను తిరగవేస్తోంది.

"అవ్వా! అవ్వా!", సుషమ వచ్చి దుర్గమ్మను వాటేసుకుంది. సుషమ వెంట మరో ఇద్దరమ్మాయిలున్నారు. అదే ఈడు వాళ్ళు.

"అవ్వా! చూడు! ఈ గీత చివరి అక్షరం స్త్రీ అంది. స్త్రీలో చివరి అక్షరం ర తో నేను

పాటను మొదలు పెట్టా. గీత కాదంటుంది. ఇది ఎటూ చెప్పదు."

దుర్గమ్మకు ఆ పిల్లల ఆట అర్థమైంది. ఆమెలోని అధ్యాపకురాలి తనం పైకొచ్చి అంది.

"మీ గీత అన్నట్లు చివరి మాట స్త్రీ అయితే, దాన్నే మొదటి మాటగా ఎత్తుకోవాల"

"ఎలా?"

"ఆ అక్షరాన్ని సీ త ర అని విడదియ్య లేం పాపా!"

"ఎందుకు?"

"ఎందుకు.... ఎందుకంటే ఆ మాట అట్లా పుట్టింది కాబట్టి", తను ఇచ్చిన వివరణ సరి అయింది కాదని తనకే అన్పించినా, దుర్గమ్మకు వేరే ఆలోచన తట్టలేదు.

సుషమ స్నేహితురాలు గీత, సుషమతో అనునయంగా అంది:

"పోనీలేవే. నీ ఇష్టప్రకారమే ర తో మొదలుపెట్టు..."

మూడో అమ్మాయి బెరుకు బెరుకుగా, అడగాలా వద్దా అనే సందేహంతో దుర్గమ్మను అడిగింది.

"మామ్మా! స్త్రీ అంటే భార్య. ఆడ జంతువు అనే మరో రెండర్థాలు కూడా ఉన్నాయట! మా సంస్కృతం మాష్టారు చెప్పాడు. నిజమేనా మామ్మా?"

పిల్లల ముఖంలోకి చూస్తూ, దుర్గమ్మ ఔననలేదు, కాదనలేదు.

"ఆ సంస్కృతం మాష్టారు బోర్.... ఈ ఆట బోర్.... అంతా బోర్", సుషమ వెర్రి ఆవేశంతో అంటూ తన గదికి పరుగెత్తింది. ○

**● 1996 ఇండియా టుడే, వార్షిక సాహిత్య సంచిక ●**